అంకితభావంతో పని చేయాలి

- రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి
- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు

వికారాబాద్, మే 2 : రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పని చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి భూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, ఇందిరమ్మ ఇండ్లు, నీట్ పరీక్ష నిర్వహణపై రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణ, రెవెన్యూ శాఖ కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి మాట్లాడుతూ భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అత్యంత పేద వారికి మంజూరు చేసేందుకు తీసుకోవాల్సిన అంశాలపై పలు సూచనలు చేశారు. అలాగే ఈ నెల 4న నిర్వహించే నీట్ ప్రవేశ పరీక్ష సజావుగా జరిగేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టాన్ని అమలు చేసేందుకు పైలెట్ ప్రాజెక్టు కింద భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులను నిర్వహించి అర్జీలను స్వీకరించాలన్నారు. వారసత్వ, సాదా బైనామాల, ఆర్ఎస్ఆర్ అసైన్‌మెంట్, ప్రభుత్వ భూముల గుర్తింపు తదితర అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. అత్యంత నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఇండ్ల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ద్వారా వచ్చిన జాబితాలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. మే 4న జరిగే నీట్ ప్రవేశ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తు, తాగునీరు, మెడికల్ క్యాంపులో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ నుంచి ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, ఆర్డీవో వాసు చంద్ర, డీఆర్డీవో శ్రీనివాస్, సీపీవో వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఈఈ కృష్ణయ్య, నీట్ సిటీ కోఆర్డినేటర్ కే.సాయిలత, తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్ : దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్‌కు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో విద్యుత్ శాఖలో పెండింగ్‌లో ఉన్న వివిధ అంశాలపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న విద్యుత్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. 2024 సంవత్సరంలో ఉన్న పెండింగ్‌లో ఉన్న సమస్యలు మే నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. దరఖాస్తు చేసుకున్న వారికి ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, మీటర్లు, బోరు కనెక్షన్లు సమకూర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా పనులు పురోగతి సాధించాలని ఆదేశించారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన పనులు అలసత్వం చేయరాదని కలెక్టర్ అధికారులకు సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, విద్యుత్ ఎస్ఈ రవి ప్రసాద్, డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించాలి

వికారాబాద్ : వేసవి దృష్ట్యా జిల్లాలోని ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ప్రాణనష్టం లాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించాలన్నారు. వైద్యారోగ్య శాఖతో పాటు, ఇతర జిల్లా అధికారులు వడదెబ్బ నివారణపై ఆయా శాఖల వారీగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో సాధారాణానికి మించి ఉష్ణోగ్రతలు నమోదవుతూ, తీవ్రమైన వేడిమితో కూడిన ఎండలు ఉన్నందున ప్రజలు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. మధ్యాహ్న సమయంలో వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, ఒకవేళ బయటకు వెళ్లాల్సి వచ్చినా తలకు టోపీ ధరించడం, తువ్వాలు చుట్టుకోవడం, చేనేత వస్త్రాలు ధరించడం తదితర జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎండ వేడిమి సమయాల్లో సాధ్యమైనంత వరకు ప్రయాణాలు పెట్టుకోరాదని, చల్లదనాన్ని అందించే నీడ ప్రదేశాల్లో ఉండాలన్నారు. వృద్ధులు, చిన్నారుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు, సముదాయాల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు వేసవి తీవ్రతతో వడదెబ్బకు లోను కాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఉపాధి హామీ కార్మికులు ఉదయం వేళలోనే పనులు చేసేలా, పని ప్రదేశాల్లో తప్పనిసరిగా నీడనిచ్చేలా షామియానాలు, తాగునీటి వసతి అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. అన్ని ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీహెచ్‌సీల్లో వైద్యాధికారులు, సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉంటూ, వడదెబ్బ నివారణ ఔషధాలు సరిపడా అందుబాటులో ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఎవరైనా వడదెబ్బకు గురైతే, వెంటనే వారిని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తే, తక్షణ చికిత్స చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

నీట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి

ఆదిబట్ల, మే 2 : నీట్ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. రంగారెడ్డి జిల్లాలో 19 కేంద్రాల్లో ఈ నెల 4న నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ కోసం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.19 కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. సంబంధిత అధికారులతో నీట్ పరీక్ష నిర్వహణపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశామని కలెక్టర్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఆర్డీవోలు చంద్రకళ, జగదీశ్వర్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంతరెడ్డి, హౌసింగ్ పీడీ ధరావత్ చంప్లా నాయక్, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, సర్వే ల్యాండ్ ఏడీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్టు

- బస్టాండ్‌లో ప్రయాణికులే లక్ష్యంగా ఒకే కుటుంబసభ్యుల దొంగతనం
- 3తులాల బంగారు నల్లపూసల దండ, రూ.13వేలు స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న పరిగి డీఎస్పీ శ్రీనివాస్

పరిగి, మే 2 : రద్దీగా ఉండే బస్టాండ్లలో ప్రయాణికులే లక్ష్యంగా దొంగతనానికి పాల్పడుతున్న ఒకే కుటుంబానికి చెందిన దొంగల ముఠాను పరిగి పోలీసులు పట్టుకున్నారు. ఇటీవల పరిగి బస్టాండ్‌లో కోయిలకొండకు చెందిన పోలీసు పుష్పకు సంబంధించి 3 తులాల బంగారు నల్లపూసల దండ, రూ.7వేలు నగదు, హైదరాబాద్‌కు చెందిన కాశయ్యకు సంబంధించి రూ.6వేలు నగదు చోరీకి గురయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు పరిగి పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దొంగల ముఠాను పట్టుకున్న విషయమై పరిగి పోలీసు సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాలు.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన గుంజల గిద్దన్న, ఆయన భార్య ఆగిరమ్మ, కూతురు కీర్తి, గిద్దన్న బావ ప్రసాద్ ఆర్టీసీ బస్టాండ్లలో రద్దీ సమయంలో దొంగతనాలకు పాల్పడుతుంటారు. సాధారణ ప్రయాణికుల్లా వచ్చి బస్సు ఎక్కే సమయంలో ప్రయాణికులను ఒత్తిడికి గురిచేసి దొంగతనం చేస్తారు. పరిగి పోలీసులు దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాలు పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్లలో దొంగతనాలు చేసి పట్టుబడ్డ నేరస్తుల వివరాలను తెలుసుకుని ఒక నిర్ధారణకు వచ్చిన పోలీసులు మూడు రోజుల క్రితం ఆగిరమ్మ, కీర్తి, ప్రసాద్‌ను పట్టుకొని విచారించగా పరిగి బస్టాండ్‌లో రెండు దొంగతనాలకు పాల్పడింది తామేనని అంగీకరించారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దొంగతనాల కేసుల్లో ఏ1గా ఉన్న గిద్దన్నను శుక్రవారం పోలీసులు అదుపులోకి విచారించగా ఏప్రిల్ 17న పరిగి బస్టాండ్‌లో దొంగతనాలు చేసినట్లు అంగీకరించాడు. గిద్దన్న దగ్గర 3 తులాల బంగారు నల్లపూసల దండ, రూ.13వేలు నగదు స్వాధీనం చేసుకొని అతడిని అరెస్టు చేశామని, రిమాండ్‌కు తరలించనున్నట్లు డీఎస్పీ తెలిపారు. గిద్దన్నపై పలు పోలీస్‌స్టేషన్లలో 14 కేసులు, ఆగిరమ్మపై పెబ్బేరు, వనపర్తి, పంజగుట్ట పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులను చేధించిన పరిగి ఎస్సై సంతోశ్‌కుమార్, సిబ్బంది గోపాల్, జావీద్, బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన బాలునాయక్‌ను డీఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై సంతోశ్‌కుమార్ పాల్గొన్నారు.

తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శుక్రవారం బంజారాహిల్స్‌లోని ఎమ్మార్సీలోని తన అధికార నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే.రామకృష్ణారావును సన్మానించారు.

అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు దగ్ధం

పెద్దేముల్, మే 2 : మండల పరిధిలోని హన్మాపూర్ బస్ స్టేజీ సమీపంలో ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన అవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలోనే మొక్కలు అగ్నికి ఆహుతి అయ్యాయి. అప్పుడు అధికారులు స్పందించలేదు. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

'బడంగ్ పేట్'లో అంచనాలకు మించి పనులు

- ఉన్నది రూ.6 కోట్లు బడ్జెట్
- వందల కోట్ల పనులకు అడ్డగోలుగా తీర్మానాలు
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రత్యేక అధికారి

మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి(ఫైల్)

బడంగ్ పేట్, మే 2: బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో బడ్జెట్ ఉన్నది 6 కోట్ల అయితే వందల కోట్ల పనులు చేయడంపై చర్చనీయాంశంగా మారింది. అంచనాలకు మించి అభివృద్ధి పనులు చేయడం పట్ల ఆరోపణలు వస్తున్నాయి. అడ్డగోలుగా పనులు చేయడం పట్ల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇటీవల మున్సిపల్ అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్న నిధులు ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. అసలు చేసిన పనులకు ఇవ్వవలసినది ఎంత ఉందని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా చేయవలసిన పెండింగ్ పనులు ఎన్ని ఉన్నాయో వాటి జాబితా తయారు చేయాలన్నారు. ముందస్తు చేసిన పనులు ఎన్ని, వాటికి ఎంత ఇవ్వాలని అధికారులను అడిగి వివరాలు తీసుకున్నారు. ప్రస్తుతం ఎన్ని పనులకు ఏ ఏ ఎజెండాలో ఎన్ని తీర్మానాలు చేశారో వివరాలతో మరో సమావేశంలో చర్చిస్తానని అధికారులతో అన్నట్టు తెలిసింది.

కార్పొరేషన్‌లో ఉన్న బడ్జెట్ రూ. 6 కోట్లు

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం రూ. 6 కోట్ల నిలువ బడ్జెట్ ఉన్నట్లు అకౌంటెంట్ పేర్కొంటున్నారు. చేసిన అభివృద్ధి పనులకు రూ. 45.88 కోట్లు కాంట్రాక్టర్లకు ఇవ్వవలసి ఉందని డీఈ వెంకన్న పేర్కొన్నారు. ముందస్తు చేసిన 50 పనుల లెక్కలు ఇంకా తేల్చలేదు. ఇంకా తీర్మానాలు చేసిన పనులు చేయవలసి ఉంది. బడ్జెట్ అంచనాలకు మించి పనులు చేయించిన అధికారుల తీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చాలామంది పనులు చేసిన కాంట్రాక్టర్లకు కోట్లలో డబ్బులు ఇవ్వవలసి ఉంది. అధికారులు మాత్రం ఎక్కువ పర్సంటేజ్ ఎవరైతే ఇస్తారో వారి చెక్కులను మాత్రమే ముందు రాస్తున్నారని చాలామంది కాంట్రాక్టర్లు ఇప్పటికే ఫిర్యాదులు చేశారు. కొంతమంది విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో జరుగుతున్న అవకతవకలపై అనేక ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయి.

అడ్డగోలుగా తీర్మానాలు..

జనవరి 2025 నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో తీర్మానాలకు లెక్కలే లేవు. అడ్డగోలుగా తీర్మానాలు చేశారన్న వాదనలు బలంగానే ఉన్నాయి. అసలు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న నిధులు రూ. 6 కోట్లు మాత్రమేనని గణాంకాలు, అధికారులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం సిబ్బంది జీతభత్యాలకు సంబంధించి నాలుగు నెలల వరకు సరిపడు బడ్జెట్ ఉండాలి. నిధులు లేకుండానే అడ్డగోలుగా తీర్మానాలు చేయడం జరిగింది. జనవరి మాసంలో జరిగిన కౌన్సిల్ తీర్మానాలను పక్కన పెట్టే ఆలోచన ఉన్నట్లు తెలిసింది. వీటన్నింటిని అధికారులు ఎలా అధిగమిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే చాలామంది విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. కాంట్రాక్టర్లే ఇంజనీరింగ్ విభాగంలో జరిగిన ఒకతవకలపై విజిలెన్స్ ఎంక్వయిరీ చేయించాలని ఫిర్యాదులు చేశారు. ఈ చిక్కుముడులకు సమాధానం ఎప్పుడు దొరుకుతుందో వేచి చూడాల్సిందే.

పెండింగ్ పనుల వివరాలు..

ఫిబ్రవరి 2024 లో కౌన్సిల్ మీటింగ్‌లో తీర్మానం చేసిన పనులు 407. అందులో పూర్తి చేసిన పనులు 356. పెండింగ్ పనులు 68 ఉన్నాయి. చేసిన పనులకు రూ.3.36 కోట్లు చెల్లించవలసి ఉంది. ఆగస్టు 2024 కౌన్సిల్ సమావేశంలో 408 పనులకు తీర్మానం చేశారు. 262 పనులను పూర్తి చేశారు. 145 పెండింగ్ లో ఉన్నాయి. చేసిన పనులకు రూ. 13.08 కోట్లు చెల్లించవలసి ఉంది. డిసెంబర్ 2024 సంవత్సరంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో 538 పనులకు తీర్మానం చేశారు. 232 పనులు పూర్తి చేశారు. 322 పనులు పెండింగ్ లో ఉన్నాయి. చేసిన పనులకు రూ. 28.06 కోట్లు ఇవ్వవలసి ఉంది. ప్రస్తుతం చేసిన పనులన్నింటికీ రూ 45.88 కోట్లు చెల్లించవలసి ఉంది. బడ్జెట్ మాత్రం 6 కోట్ల ఉంది. ఈ డబ్బులన్నీ ఎక్కడి నుంచి తీసుకువస్తారని ప్రత్యేక అధికారి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

ముందస్తు చేసిన పనుల లెక్క తేలేది ఎప్పుడో..

మున్సిపల్ కార్పొరేషన్‌లో అడ్డగోలుగా ముందస్తు పనులు చేశారు. చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వలేదు ఇప్పటివరకు. పనులు ఒకరు చేస్తే టెండర్ మరొకరికి వచ్చింది. వాటిని తేల్చకుండా అధికారులు అలాగే మూసి పెట్టారు. దీంతో కాంట్రాక్టర్ల మధ్యన నిత్యం గొడవలు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు చెప్తేనే ముందస్తు పనులు చేసినట్లు కాంట్రాక్టర్లు చెప్తున్నారు. అధికారులు మాత్రం 50 వర్కులు మాత్రమే చేసినట్లు చెప్తున్నారు. ఈ ముందస్తు చేసిన పనుల చిక్కుముడి వీడేది ఎప్పుడోనని కాంట్రాక్టర్లు ఆందోళనలో ఉన్నారు.

అఘోరీకి ఒకరోజు పోలీస్ కస్టడీ

- 2 గంటల విచారణ అనంతరం షాద్‌నగర్ కోర్టుకు..
- అక్కడి నుంచి చంచల్ గూడకు తరలింపు

అఘోరీని షాద్‌నగర్ కోర్టు నుంచి చంచల్‌గూడ జైలుకు తరలిస్తున్న పోలీసులు

చేవెళ్ల రూరల్, మే 2 : పూజల పేరుతో మహిళ (సినీ నిర్మాత)ను మోసం చేసిన కేసులో నిందితుడు అఘోరీ అలియాస్ శ్రీనివాస్ అలియాస్ శివ విష్ణు బ్రహ్మ అల్లూరి (28)ను శుక్రవారం మోకిలా పోలీసులు ఒక రోజు కస్టడీకి తీసుకున్నారు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాలు.. విచారణలో భాగంగా చంచల్‌గూడ జైలులో ఉన్న అఘోరీని మూడు రోజుల కస్టడీని కోరితే ఒక రోజు కస్టడీకి అనుమతించారని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో అఘోరీని డీఐ సమరం రెడ్డితో కలిసి రెండు గంటల పాటు విచారణ నిర్వహించామన్నారు. తర్వాత చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించి వైద్య పరీక్షల అనంతరం మరోసారి చేవెళ్ల కోర్టుకు తీసుకొచ్చామన్నారు. చేవెళ్ల కోర్టు ఇన్‌చార్జి జడ్జి కొత్త రవి షాద్‌నగర్ కోర్టులో నూతనంగా బాధ్యతలు స్వీకరించడంతో పోలీసులు అక్కడికి తీసుకెళ్లారు. న్యాయమూర్తి కేసు వివరాలను పరిశీలించి, అఘోరీని మళ్లీ చంచల్‌గూడ జైలుకు తరలించాలని ఆదేశించారు. మీడియా ప్రతినిధులు అఘోరీతో మాట్లాడే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు అనుమతించలేదు.

స్వచ్ఛతలో సత్తా చాటేనా?

స్వచ్ఛ సర్వేక్షణ్ -24పై కొనసాగుతున్న కేంద్ర బృందం సర్వే

టాయిలెట్ల నిర్వహణపై అసంతృప్తి?

త్వరలో కేంద్రం ప్రకటించే ర్యాంకుల్లో 'హైదరాబాద్'పై ఉత్కంఠ

సిటీబ్యూరో, మే 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నగరం స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలుస్తుందా? బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంతో వచ్చిన ర్యాంకుల కంటే మెరుగైన ఫలితాలను రాబడుతుందా? ప్రస్తుత పారిశుధ్య నిర్వహణలో క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తుంటే.. అనేక అనుమానాలు, ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. కొన్ని రోజులుగా కేంద్ర స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు నగరంలో సర్వే చేస్తున్నాయి. మరో ఐదు రోజుల్లో సర్వే ప్రక్రియను ముగించుకుని ఢిల్లీకి వెళ్లనున్నది. అయితే పారిశుధ్య నిర్వహణపై క్షేత్రస్థాయి పర్యటనలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. పబ్లిక్ టాయిలెట్ల విషయంలోఎంపిక ప్రాంతాల్లోనే తిప్పుతున్న జీహెచ్ఎంసీ అధికారుల తీరును తప్పుపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం వాటర్ ప్లస్ కేటగిరీలో ఈ బృందం సర్వే జరుపుతున్నది. మరోవైపు పారిశుధ్య నిర్వహణలో హైదరాబాద్‌కు మార్కులు అశించిన స్థాయిలో రావడం కష్టమేనన్న చర్చ జరుగుతున్నది.

అధికారుల్లో గుబులు..

స్వచ్ఛ సర్వేక్షణ్-2024 ర్యాంకుల ప్రకటన, సర్వే ప్రక్రియ ప్రారంభమవుతున్న తరుణంలో జీహెచ్ఎంసీ అధికారుల్లో గుబులు మొదలైంది. ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కీలక నగరాలకు ర్యాంకులను ప్రకటిస్తూ వస్తున్నది. 2015 నుంచి 2023 వరకు 10 లక్షల జనాభా కంటే ఎక్కువ సిటీ జాబితాలో హైదరాబాద్ మెరుగైన ర్యాంకింగ్ సాధించింది . 2023 సంవత్సరానికి సిటీ 9వ ర్యాంకు, భారతదేశంలో ఫైవ్ స్టార్ రేటింగ్ పొందిన చెత్త రహిత నగరంగా హైదరాబాద్‌కు అవార్డు దక్కింది. ఈ నేపథ్యంలోనే నగరంలో ప్రస్తుత సర్వే బృందం స్వచ్ఛ సర్వేక్షణ్-2024పై సర్వే ప్రారంభించింది. వచ్చే నెలలో ర్యాంకుల జాబితాను కేంద్రం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి. జీవీపీ పాయింట్లు (గార్బేజీ వనరేబుల్ పాయింట్లు/జీవీపీ), ఇంటింటి చెత్త సేకరణ, రెడ్ స్పాట్స్, శాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సీ అండ్ డీ ప్లాంట్ల నిర్వహణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని దాదాపు 9500 మార్కులతో సర్వే జరుపుతున్నది. అయితే సర్వే ప్రారంభ దశలోనే క్షేత్రస్థాయిలో పరిస్థితులు విరుద్ధంగా కనిపించినట్లు తెలుస్తున్నది. ఎందుకంటే క్షేత్రస్థాయి పర్యటన సందర్భంలో పారిశుధ్య నిర్వహణలో మళ్లీ డస్ట్ బిన్ల తరహాలో స్వీపింగ్ వేస్ట్ కలెక్షన్ పాయింట్లు కనిపించడం.. జీవీపీ పాయింట్ల ఎత్తివేతలో విఫలం, స్వచ్ఛ ఆటోల పనితీరుపై పౌరుల నుంచి ఆశించిన స్పందన లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

టాయిలెట్ల నిర్వహణపై ఆరా

కేంద్రం నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ బృందాలు వచ్చి నగరంలోని టాయిలెట్లను పరిశీలించింది. అయితే అధికారులు మాత్రం వారిని తప్పుదోవ పట్టించి శుభ్రంగా ఉన్న టాయిలెట్ల దగ్గరకు తీసుకువెళ్లి చూపించడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం చేసినట్లు తెలిసింది. 10 రోజుల స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో భాగంగా నగరానికి వచ్చిన కేంద్ర బృందం టాయిలెట్ల శుభ్రత, వినియోగం, నిర్మాణ నాణ్యతను చెక్ చేస్తున్నది. వీటితో పాటు గ్రేటర్‌లో పలు చోట్ల లూ కేఫ్‌లకు తాళాలు వేస్తూ దర్శనమిస్తున్నాయి. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్ ఆపరేట్ అండ్ ట్రాన్స్‌ఫర్ (డీబీఎఫ్‌వోటీ) విధానంలో నగరంలో 60 లూ కేఫ్‌లను 2018 జులైలో జీహెచ్ఎంసీ అందుబాటులోకి తెచ్చింది. తొలిదశలో ఖైరతాబాద్, శేరిలింగంపల్లి జోన్లలో ఈ కేఫ్‌లను ప్రారంభించింది. సిటీవాసుల టాయిలెట్ల సమస్య తీర్చడంతో పాటు నిరుద్యోగులకు స్వయం ఉపాధి కల్పించడమే దీని లక్ష్యం. వీటిని 15 సంవత్సరాల ఒప్పందం కింద మెస్సర్స్, ఇన్సోరా ఏజెన్సీలకు అప్పగించారు. లూ కేఫ్‌లో భాగంగా ముందు భాగంలో వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఈ షాపు వెనకే ఆనుకుని లగ్జరీ స్మార్ట్ టాయిలెట్లు ఏర్పాటు చేశారు. వీటిని సదరు వ్యాపారులు ఇచ్చిన అద్దెతో ఏజెన్సీలు మెయింటనెన్స్ చేయాలి. చాలా చోట్ల నిర్వహణ సరిగా లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కరెంట్ మీటర్ల గోల్‌మాల్

మొన్న 30.. ఇవాళ 42!

ఒకే గదిలో పదుల సంఖ్యలో మీటర్ల గుర్తింపు

అక్రమార్కులతో సిబ్బంది కుమ్మక్కు..

సరైన పత్రాలు లేకుండానే మీటర్ల మంజూరు

విచారణ చేపట్టిన విద్యుత్ విజిలెన్స్ అధికారులు

కేసు నమోదు చేసిన పోలీసులు

సిటీబ్యూరో/ శేరిలింగంపల్లి, మే 2 (నమస్తే తెలంగాణ): ఖాజాగూడా చిత్రపురికాలనీలో చెన్నకేశవరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వచేసిన 42 విద్యుత్ మీటర్లను రాయదుర్గం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇటీవల విద్యుత్ శాఖ అధికారులు, దుండిగల్ పోలీసులు కలిసి దుండిగల్‌లోని ప్రభుత్వ స్థలంలో వేణుగోపాల్ అనే వ్యక్తి నిర్మించిన రేకుల ఇంటిపై దాడి చేసి 30 మీటర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఇంటి నంబర్లు, పత్రాలు లేకుండానే కరెంటు మీటర్లను పొందినట్లు విచారణలో తేలింది. ప్రభుత్వ స్థలంలోని ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరించుకునేందుకు కరెంట్ మీటర్లను వాడారంటూ పోలీసులు నిర్ధారించి నిందితుడిని అరెస్ట్ చేశారు.

సాధారణంగా విద్యుత్ మీట